పెద్దాపూర్ గురుకులంలో దిద్దుబాటు చర్యలు

# ఇద్దరి ప్రాణాలు పోయిన తర్వాత..

- శాశ్వత వసతికి ముమ్మర ఏర్పాట్లు
- ముమ్మురంగా క్లీనింగ్ పనులు
- శిథిలావస్థలో ఉన్న రెండు రేకుల షెడ్లు కూల్చివేత
- పాడుబడిన బావి పూడ్చివేత
- బయటపడ్డ నాలుగు పాములు



మెట్‌పల్లి రూరల్, ఆగస్టు 10: ఘనమైన చరిత్ర కలిగిన పెద్దాపూర్ బాలుర గురుకులంలో ఇద్దరి ప్రాణాలు పోతే గానీ అధికారులు తేరుకోలేదు. వరుస ఘటనలు జరిగితే గానీ రక్షణ చర్యలు చేపట్టాలన్న విషయం గుర్తుకురాలేదు. గత నెల 26న ఓ విద్యార్థి మృతి చెందగా, అస్వస్థతకు గురైన మరో ఇద్దరు విద్యార్థులు చికిత్స తర్వాత కోలుకున్నారు. ఈ నెల 9న మరో విద్యార్థి మృతి చెందగా, మరో ఇద్దరు తీవ్ర అస్వస్థతతో నిజామాబాద్‌లో చికిత్స పొందుతున్నారు. మొదటి ఘటన తర్వాత ప్రిన్సిపాల్‌ను సస్పెండ్ చేసి, పాత భవనంలోని విద్యార్థులకు అసంపూర్తిగా ఉన్న కొత్త భవనంలో తాత్కాలిక వసతి కల్పించి అధికారులు చేతులు దులుపుకున్నారు. తిరిగి రెండో ఘటనలో మరో విద్యార్థి ప్రాణాలు కోల్పోవడంతో తల్లిదండ్రుల ఆగ్రహానికి గురైన ప్రజాప్రతినిధులు, అధికారులు ఇప్పుడు తేరుకొని కొత్త భవనాన్ని పూర్తిస్థాయిలో అందుబాటులోకి తెచ్చేందుకు పూనుకున్నారు. కోరుట్ల మున్సిపాలిటీతోపాటు వెల్లుల్ల, చౌలమద్ది, పెద్దాపూర్ గ్రామపంచాయతీ పారిశుధ్య సిబ్బందితో గురుకుల పాఠశాల ఆవరణ చదును చేయిస్తున్నారు. ఎక్స్‌వేటర్లు, ట్రాక్టర్ల సహాయంతో పనులు చకచకా చేపడుతున్నారు. పిచ్చి మొక్కలు, పేరుకుపోయిన చెత్తాచెదారాన్ని తొలగిస్తున్నారు. శిథిలావస్థలో ఉన్న రెండు రేకుల షెడ్ల భవనాలను పూర్తిగా నేలమట్టం చేశారు. కొత్త భవనం వెనకాల ఉన్న పాడుబడ్డ బావిని పూడ్చివేయిస్తున్నారు. ఇటు తాత్కాలిక వసతి కల్పించిన కొత్త భవనంలో అసంపూర్తిగా ఉన్న పనులను చేపడుతున్నారు. ప్రధానంగా విద్యుత్, ప్లంబింగ్ పెండింగ్‌లో ఉండగా, ముందుగా గదుల్లో విద్యుత్ పనులు చేపడుతున్నారు. సీలింగ్ ఫ్యాన్లు, బల్బులు బిగిస్తున్నారు. అలాగే, ప్లంబింగ్ పనులు ఒకటి రెండు రోజుల్లో ప్రారంభించనున్నారు. మూత్రశాలలు, మరుగుదొడ్లు, స్నానపు గదులను ఉపయోగించేందుకు చర్యలు చేపట్టారు. స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ గౌతమ్‌రెడ్డి దగ్గరుండి పర్యవేక్షిస్తున్నారు. ఆవరణలో పారిశుధ్య పనులు, కొత్త భవనంలో అసంపూర్తి పనులు పూర్తిచేసేందుకు దాదాపు ఏడు రోజులు పడుతుందని ఆయన చెప్పారు. సాధ్యమైనంత తొందరగా పనులను పూర్తిచేసి ఈ నెల 15న విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశం ఏర్పాటు చేస్తామని, 16 నుంచి కొత్త భవనంలో తరగతులు నిర్వహిస్తామని తెలిపారు.

### బయటపడుతున్న పాములు

పిచ్చి చెట్లు, ముళ్లపొదలను తొలగించడం, శిథిల భవనాలను కూల్చివేయడం, పాడుబడిన బావి, మురికి కుంటను పూడ్చే క్రమంలో పాములు బయటకు వస్తున్నాయి. శనివారం నాలుగు పాములు కనిపించాయి. వాటిని ఎక్స్‌కవేటర్లతో చంపేశారు. ఇంకా వారం రోజులపాటు పనులు చేయనుండగా, మరిన్ని పాములు బయటకు రావొచ్చని తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేశారు. పాఠశాల ఆవరణను ఎప్పటికప్పుడు క్లీన్‌గా ఉంచాలని, అప్పుడే పాముల సంచారం తగ్గుతుందని చెబుతున్నారు.



కొత్త భవనం వెనకాల పాడుబడిన బావిని పూడ్చుతున్న ఎక్స్‌కవేటర్



పాఠశాల ఆవరణలో పిచ్చిమొక్కల మధ్యే ఆరేసిన విద్యార్థుల బట్టలు

## పెద్దపల్లి బీసీ గురుకులంలో అన్నీ అసౌకర్యాలే

పెద్దపల్లి, ఆగస్టు 10(నమస్తే తెలంగాణ)/పెద్దపల్లి కమాన్ : పెద్దపల్లిలోని బీసీ గురుకుల బాలికల పాఠశాల, కళాశాలలో 590 విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. పెద్దపల్లి పట్టణానికి దూరంగా పొలాల మధ్యలో ఉండడం.. బురద రోడ్డు కావడంతో విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు వచ్చేందుకు ఇబ్బందులు పడుతున్నారు. హాస్టల్ ఆవరణలో పిచ్చిమొక్కలు పెరిగాయి. పేరుకుపోయిన చెత్తాచెదారం కంపు కండుతున్నది. హాస్టల్ చుట్టూ ప్రహరీ సరిగా లేకపోవడంతో విషపురుగులు వచ్చే ప్రమాదం ఉందని విద్యార్థులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. గతంలో అన్నం, కూరలు, టిఫిన్లు బాగుండేవని పిల్లలు చెప్పేవారని, ఇప్పుడు వంటలు సరిగా ఉండక పోవడంతో అన్నం తినలేక ఖాళీ కడుపుతో ఉంటున్నట్టు విద్యార్థులు తమతో చెబుతున్నారని తల్లిదండ్రులు చెబుతున్నారు. హాస్టల్ ముందు భాగంలో పైపులైన్ లీకేజీతో నీటి మడుగు తయారై దుర్వాసన వస్తుందని, దీంతో ఈగలు, దోమలు తయారై విద్యార్థులు అనారోగ్యం బారిన పడుతున్నారని తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. దోమల బెడద, కిటికీలు సరిగా లేక కోతుల బెడద, పాములు, తేళ్లతో తంటాలు పడుతున్నాని చెబుతున్నారు.

### రోడ్డు సౌకర్యం కల్పించాలి



హాస్టల్‌కు వచ్చేందుకు రోడ్డు అధ్వానంగా ఉంది. వానకాలంలో ఇక్కడికి రావడం చాలా ఇబ్బందవుతుంది. వర్షం పడితే మొత్తం బురదమయంగా మారుతుంది. రంగంపల్లి రహదారి నుంచి ఇక్కడి వరకు నడుచుకుంటూ రావాల్సిందే. ఇటు వైపు రోడ్డు బాగు లేదని ఆటో వాళ్లు రావడం లేదు. విద్యార్థులకు ఏమైనా అత్యవసరమైతే మెయిన్ రోడ్డు వరకు నడిచి వెళ్లాలి. రంగంపల్లి నుంచి హాస్టల్ వరకు సీసీ రోడ్డు వేయించాలి.

**- ఇరుమళ్ల శంకర్, విద్యార్థిని తండ్రి, భూపతిపూర్ (సుల్తానాబాద్)**

### నాణ్యమైన భోజనం అందించాలి



హాస్టల్‌లో అందించే భోజనం బాగుండడం లేదు. కూరలు చప్పిడిగా, నీళ్లుగా ఉంటున్నయ్. అన్నం సరిగ్గా లేక విద్యార్థులు అవస్థలు పడుతున్నరు. టిఫిన్లు కూడా రుచిగా ఉండడం లేవు. గతంలో ఉన్న వంట మనిషి మంచిగా చేసేది. ఈ ఏడాది వేరే వాళ్లు రావడంతో సరిగ్గా వండడం లేదు. రుచికరంగా లేకపోవడం వల్ల విద్యార్థులు అన్నం, కూరలు పారేస్తున్నరు. అనుభవం కలిగిన కుక్కర్స్‌తో వంటలు చేయించాలి. నాణ్యమైన భోజనం అందించాలి. **- ముత్యాల సంతోష్, విద్యార్థిని తండ్రి, హన్మంతునిపేట(పెద్దపల్లి)**

ఇది నిర్లక్ష్యానికి నిలువుటద్దం.. విద్యార్థుల రక్షణ గురించి ఏమాత్రం పట్టింపులేనితనానికి నిదర్శనం.. అసలే కుక్కల దాడులు పెరుగుతున్న వేళ ఏకంగా ఓ కుక్క రామకృష్ణకాలనీలోని మహాత్మా జ్యోతిబాపూలే గురుకుల పాఠశాల తరగతి గదిలోకి వచ్చింది. విద్యార్థులకు తరగతులు నడుస్తుండగా.. ఓ మూలన ఇలా నిద్రపోయింది. ఒకవేళ అది పిల్లల మీదకు ఎగబడితే పరిస్థితి ఏంటి? అప్పుడుగానీ పట్టించుకోరా..? ఆ పాఠశాల సిబ్బందికే తెలియాలి! **- కరీంనగర్, స్టాఫ్ ఫొటోగ్రాఫర్**



# గురుకులం చుట్టూ అన్నీ సమస్యలే

- అద్దె, శిథిల భవనాల్లో విద్యాలయాలు
- అరకొర వసతుల మధ్యన విద్యార్థుల అవస్థలు
- ప్రమాదకరంగా చెట్ల పొదలు, పాముల పుట్టలు
- మరుగుదొడ్లు, స్నానపు గదులు సరిపడా లేక ఇబ్బందులు
- బెడ్స్ లేక నేలపైనే నిద్రించాల్సిన పరిస్థితులు
- తాటిపెల్లి బాలికల విద్యాలయంలో అన్నీ అసౌకర్యాలే
- 174 మందికి 10 బాత్‌రూములే దిక్కు
- ఒక్క బెడ్‌లో ఇద్దరు బాలికల నిద్ర
- పెద్దపల్లి బీసీ గురుకులంలో అన్నీ ఇక్కట్లే
- 'నమస్తే' విజిట్‌లో బట్టబయలు



గురుకులం ఆవరణలో పాముల పుట్ట

గురుకులాలు సమస్యల వలయంలో కొట్టుమిట్టాడుతున్నాయి. అసలే శిథిలావస్థకు చేరిన భవనాలు, అటవీ ప్రాంతాన్ని తలపిస్తున్న పరిసరాలు, అరకొర వసతుల మధ్యన నిర్వహణ లేక అధ్వానంగా మారాయి. ఆవరణలో చెట్లపొదలు, పాముల పుట్టలు పిల్లలను వణికిస్తున్నాయి. స్నానపుగదులు, మూత్రశాలలు, మరుగుదొడ్లు సరిపడా కరువయ్యాయి. పడుకునేందుకు బెడ్లు కూడా లేక నేలపైనే నిద్రించాల్సిన పరిస్థితులు ఉన్నాయి. చాలాచోట్ల రాత్రిపూట కరెంట్ పోతే చీకట్లు కమ్ముకుంటున్నాయి. మెట్‌పల్లి మండలం పెద్దాపూర్ గురుకులంలో 15 రోజుల వ్యవధిలోనే ఇద్దరు విద్యార్థులు చనిపోయి, మరో నలుగురు తీవ్ర అస్వస్థత చెందడానికి నిర్వహణ లోపం, వసతుల లేమే కారణమని తెలుస్తుండగా, శనివారం 'నమస్తే తెలంగాణ' పలు గురుకులాలను విజిట్ చేసింది. ఎటు చూసినా సమస్యలే కనిపించగా, పిల్లలు భయభయంగా గడుపుతున్నట్టు వెలుగులోకి వచ్చింది.



తాటిపెల్లి గురుకులంలో తరగతి గదుల పక్కనే పిచ్చి మొక్కలు

జగిత్యాల, ఆగస్టు 10 (నమస్తే తెలంగాణ): మల్యాల మండలం తాటిపెల్లి బాలికల గురుకుల పాఠశాల ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోనే ఉత్తమ విద్యా కేంద్రంగా పేరుగాంచింది. ఇది 1983 నవంబర్ 20న ప్రారంభమై, నాలుగు దశాబ్దాలుగా విద్యాబోధన సాగిస్తూనే ఉన్నది. మొదట 5 నుంచి పదో తరగతి వరకు ఉండగా, 2019-20 విద్యా సంవత్సరం నుంచి రెసిడెన్షియల్ జూనియర్ కాలేజీగా అప్‌గ్రేడ్ అయింది. ప్రస్తుతం స్కూల్లో 650 మంది అభ్యసిస్తున్నారు. ఐదు నుంచి పదో తరగతి దాకా రెండేసి సెక్షన్లు నిర్వహిస్తున్నారు. ఎంపీసీ, బైపీసీ విభాగంలో జూనియర్ కాలేజీ నడుస్తుండగా, ప్రస్తుతం ఫస్టియర్‌లో 88 మంది, సెకండియర్‌లో 86 మంది చదువుతున్నారు. సెకండియర్ చదువుతున్న వారందరూ ఫస్టియర్ 400కు పైగా మార్కులు సాధించినవారే కావడం విశేషం. పదో తరగతి వరకు సైతం విద్యార్థులకు నాణ్యమైన విద్యనే అందుతున్నది.

### బోధన అంశంలో ఇబ్బందులు

గురుకుల పాఠశాలలో బోధనకు సంబంధించిన కొన్ని సమస్యలు పిల్లలను ఇబ్బందిపెడుతున్నాయి. గురుకులాన్ని జూనియర్ కాలేజీగా అప్‌గ్రేడ్ చేసినా, కాలేజీ పిల్లల కోసం ప్రత్యేక వసతిగృహాలు, డార్మెటరీ హాల్, భోజనశాల, తరగతి గదులు, ప్రయోగశాలలు ఏవీ నిర్మించలేదు. దీంతో పాఠశాలకు సంబంధించిన తరగతి గదులు, ప్రయోగశాలలు, భోజన శాలల్లోనే అడ్జెస్ట్ కావాల్సిన వస్తున్నది. జూనియర్ కాలేజీకి తరగతి గదులు ఇవ్వాల్సి రావడంతో పాఠశాల విద్యార్థుల తరగతి గదులు పూర్తిగా శిథిలమైన వాటిలో నిర్వహించాల్సిన దుస్థితి ఉన్నది. బెంచీలు, కుర్చీలు సైతం చెడిపోయిన వాటినే పిల్లలు వినియోగించాల్సి వస్తున్నది. పై కప్పులు దెబ్బతిని, కిటికీలు, తలుపులు విరిగిపోయి, ప్రమాదకరంగా ఉన్న తరగతి గదుల్లో చదువు కోవడం కనిపించింది. ఇంటర్ పిల్లలకు ప్రత్యేకమైన ల్యాబ్‌లను ఏర్పాటు చేయలేదు. పదో తరగతి పిల్లలకు సంబంధించిన ల్యాబ్‌లోనే ఇంటర్ పిల్లలు ప్రయోగాలు చేసుకోవాల్సిన దుస్థితి నెలకొంది. ఇక బోధన సిబ్బంది నియామకం విషయంలోనూ ప్రభుత్వం పట్టింపులేనితనం కనిపిస్తున్నది. జూనియర్ కాలేజీని ఏర్పాటు చేసినప్పటికీ, లెక్చరర్లను అపాయింట్‌మెంట్ చేయలేదు. కేవలం ఐదుగురు ఫ్యాకల్టీ మెంబర్లను మాత్రం తాత్కాలిక పద్ధతిలో నియమించారు. ఇక జూనియర్ కాలేజీ పిల్లల కోసం పీడీ పోస్టును సైతం ఇవ్వకపోవడంతో పాఠశాలకు చెందిన పీఈటీతోనే వెల్లదీస్తున్నారు.

### వసతిగృహాల్లో అసౌకర్యాలు

వసతిగృహాల్లో అసౌకర్యాలు రాజ్యమేలుతున్నాయి. 174 మంది ఇంటర్ విద్యార్థులకు కేవలం 10 స్నానపు గదులే ఉన్నాయి. బాత్‌రూములే తమకు పెద్ద సమస్యగా మారాయని పిల్లలు ఆవేదన వ్యక్తం చేశారు. ఉదయం 5 నుంచి 6 మధ్య వ్యాయామం, క్రీడలు ఉంటాయని, 6 నుంచి 7 గంటల మధ్య స్నానానికి సమయం కేటాయించారన్నారు. గంట వ్యవధిలో పది స్నానపుగదుల్లో 174 మంది ఎలా స్నానం చేస్తారని వాపోయారు. కాలకృత్యాలు, స్నానానికి ఒక్కొక్కరికి కనీసం 10 నుంచి 15 నిమిషాలు పడుతుందని, ఈ లెక్కన గంటలో ఒక్క వాష్‌రూమ్‌ను ఐదుగురి కంటే ఎక్కువ వాడలేరని, ఎంత వేగంగా పనులు చేసుకున్నా 60 నుంచి 70 మంది కంటే ఎక్కువ మించలేరన్నారు. 7 నుంచి 8 గంటల మధ్య అల్పాహారం ఇస్తారని, 8 గంటలకు క్లాసులు ప్రారంభమవుతాయని చెప్పారు. ఆడపిల్లలకు వాష్‌రూమ్స్ అత్యవసరం అన్న విషయం ప్రభుత్వం గుర్తుంచుకోవాలన్నారు. డైనింగ్ హాల్‌లోను వసతులు లేవని, కొందరు పైన కూర్చొని తింటే మరి కొందరు కింద కూర్చొని భోజనం చేస్తున్నామన్నారు. ఇక రాత్రిపూట పడుకోవడం అంటే భయం వేస్తున్నదని చెప్పారు. తమకు రెండు డార్మెటరీ హాల్స్ కేటాయించారని, కేవలం 42 డబుల్ డెక్కర్ మంచాలు ఉన్నాయని, అందులో 84 మంది పడుకునేందుకు మాత్రమే అవకాశం ఉంటుందన్నారు. అయితే తాము 174 మంది విద్యార్థులం ఉన్నామని, మంచాలు, గదులు సరిపోకపోవడంతో ఒక్క మంచంలో ఇద్దరు పడుకుంటున్నామని వాపోయారు. ఇది అన్నింటి కంటే పెద్ద సమస్యగా మారిపోయిందని కన్నీటి పర్యంతమయ్యారు. అయితే గురుకులం మొత్తం సువిశాల స్థలంలో ఉంది. కానీ, ఎటూ చూసినా పిచ్చిచెట్లు పెరిగిపోయి, పాము పుట్టలతో నిండిపోయి కనిపించింది. రాత్రిపూట భయం వేస్తున్నదని, వాష్‌రూమ్స్‌కు వెళ్లాలంటే ఇబ్బందేనని చాలా మంది విద్యార్థినులు వాపోయారు. చెత్తాచెదారం, పిచ్చి మొక్కలు, పుట్టల మధ్యలో చాలా సార్లు విషకీటకాలు కనిపించాయని ఆవేదన వ్యక్తం చేశారు. భోజనం బాగుంటుందని, మెనూ ప్రకారం ఇస్తున్నారని, అయితే ఇతర సౌకర్యాలే భయంకరంగా ఉన్నాయని పేర్కొన్నారు.




తాటిపెల్లి గురుకులం తరగతి గదిలో ట్యూబ్ వెలుతురులో విద్యార్థినులు

### కాస్మోటిక్స్ లేవు.. బెడ్‌షీట్స్ రావు

గురుకుల విద్యార్థినులకు కాస్మోటిక్స్ చార్జెస్ రావడం లేదని, అలాగే బెడ్‌షీట్స్ సైతం ఇవ్వడం లేదని పిల్లలు చెబుతున్నారు. ఇతర గురుకులాలు, వసతిగృహాల్లో చదివే విద్యార్థులకు కాస్మోటిక్ చార్జెస్ ఇస్తున్నారని, అయితే తమకు సబ్బులు, కొబ్బరినూనె, ఇతర హైజెనిక్స్‌కు సంబంధించిన పరికరాలు ఇవ్వడం లేదని విద్యార్థులు వాపోయారు. స్వయంగా వాటిని ఏర్పాటు చేసుకోవడం కష్టంగా మారిందని, బెడ్‌షీట్స్ సైతం రాకపోవడం పెద్ద సమస్యగా మారిపోయిందని వివరించారు. అలాగే ప్రతిరోజు తమ దుస్తులను తామే ఉతుక్కోవాల్సి వస్తున్నదని, ఇతర వసతిగృహాల్లో దోబీలను, వాషింగ్ మిషన్లను ఏర్పాటు చేసిన ప్రభుత్వం, తమకు సౌకర్యం కల్పించకపోవడం సరికాదన్నారు. అలాగే నోట్‌బుక్స్, టెక్స్ట్‌బుక్స్ యూనిఫామ్స్ సరిపడా ఇవ్వడం లేదని వాపోతున్నారు.

### ఒక్కో బెడ్డుపై ఇద్దరు.. ఇబ్బందికర అంశం

గురుకులాల్లో ముఖ్యంగా అమ్మాయిల గురుకులాల్లో అసౌకర్యాలు ఉండడం సరికాదని విద్యారంగ నిపుణులతోపాటు వైద్యులు పేర్కొంటున్నారు. కిశోర బాలికలు, యుక్తవయసు బాలికలకు వాష్‌రూమ్స్‌తో పాటు, నిద్రించేందుకు సౌకర్యవంతమైన బెడ్స్ ఏర్పాటు చేయాల్సి ఉంటుందని అభిప్రాయపడ్డారు. 170 మంది విద్యార్థినులకు 10 వాష్‌రూమ్స్ ఏర్పాటు చేయడం సరికాదని, ఈ పద్ధతిని మార్చాలని సూచించారు. తక్కువ వాష్‌రూమ్స్ ఉండడం వల్ల అమ్మాయిలకు ఇబ్బందులు వస్తాయని, అనారోగ్యంబారిన పడే ప్రమాదం ఉందని చెబుతున్నారు. ఇక ఒక మంచంలో ఇద్దరు అమ్మాయిలు అది ఇంటర్మీడియెట్ అమ్మాయిలకు కేటాయించడం అత్యంత ప్రమాదకరమైన అంశమని వైద్యులు వ్యాఖ్యానించారు. ఇది భవిష్యత్తులో ఇబ్బందికరమైన పరిస్థితికి దారితీసే అవకాశం ఉందని, ప్రతి విద్యార్థినికి ఒక బెడ్ ఏర్పాటు చేయాల్సిందేనని హెచ్చరిస్తున్నారు.

## స్నానం చేయాలంటే.. పొద్దున 3 గంటలకు లేవాల్సిందే

600 మందికి ఉన్నవి 14 బాత్రూములే



రక్షణ లేని గంగాధర మహాత్మా జ్యోతిబాపూలే బాలికల గురుకుల పాఠశాల భవనం

గంగాధర, ఆగస్టు 10 : గంగాధర మండలం మధురానగర్ చౌరస్తాలోని మహాత్మా జ్యోతిబాపూలే బాలికల గురుకుల పాఠశాలలో సమస్యలు తిష్టవేశాయి. 600 మంది విద్యార్థులు ఉన్న ఈ పాఠశాలను పట్టించుకునేవారు కరువయ్యారు. పాఠశాలలో 14 బాత్‌రూములు ఉన్నాయని, ఉదయం 3 గంటలకు నిద్ర లేచి స్నానం చేస్తేనే క్లాసుకు అందుతామని, ఏ కాలంలోనైనా చన్నీళ్లతో స్నానం చేస్తున్నామని విద్యార్థులు వాపోయారు. స్నానం చేయడానికి నీళ్లు సరిపోవడం లేదని, రెండు బోర్లలో ఒక్కటే వాడుతున్నారని, మరో దాని దగ్గర నీళ్లు పట్టుకుంటే తిడుతున్నారని ఆరోపించారు. భోజనంలో పురుగులు వస్తున్నాయని, శనివారం కూడా వచ్చాయని తమ తల్లిదండ్రులతో వాపోయారు. పాఠశాల ఎదుట మొదటి అంతస్తులో రక్షణ గ్రిల్స్ ఏర్పాటు చేసి మిగిలిన అంతస్తులకు ఏర్పాటు చేయలేదని, గదులకు ఉన్న కిటికీలు సరిగా లేక తమకు రక్షణ లేకుండా పోతోందన్నారు. రాత్రి సమయంలో బాత్రూంకు వెళ్లాలంటే లైట్లు లేక ఇబ్బందులు పడుతున్నారు. గతంలో అక్కడికి పాము వచ్చిందని చెబుతున్నారు. సోమవారం అడిషనల్ కలెక్టర్ పాఠశాలకు వచ్చినప్పుడు సమస్యలు వివరించినా ఫలితం లేదని వాపోయారు. పై అధికారులు స్పందించి పాఠశాలలో ఉన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతున్నారు. ఇక్కడి సమస్యలపై ఆర్‌సీవో అంజలిని ఫోన్‌లో సంప్రదించగా, విచారణ చేసి చర్యలు తీసుకుంటామని తెలిపారు.



గురుకులం ఆవరణలో పిచ్చి మొక్కలు



ఒక్కో బెడ్‌పై పడుకున్న ఇద్దరు విద్యార్థినులు

# 'నీరు'గారుతున్న లక్ష్యం

- చెక్ డ్యాంల మరమ్మతులు మరిచిన సర్కార్
- ఆందోళనలో రైతాంగం



కూలిన చెక్‌డ్యాం వద్ద వృథాగా పోతున్న నీరు

రాజన్న సిరిసిల్ల, ఆగస్టు 10 (నమస్తే తెలంగాణ) : వృథాగా పోతున్న వరదనీటిని ఒడిసి పట్టాలన్న లక్ష్యం నీరు గారిపోతున్నది. రాజన్న సిరిసిల్ల జిల్లాలోని మానేరు, మూలవాగులను జీవనదులుగా మార్చాలన్న ఉద్దేశ్యంతో కేసీఆర్ ప్రభుత్వం ₹174 కోట్లతో 24 చెక్‌డ్యాంల నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. అందులో సిరిసిల్ల మానేరుపై గంభీరావుపేట మండలం నర్మాల నుంచి మొదలుకుని సిరిసిల్ల మానేరు బ్రిడ్జి వరకు 11, వేములవాడ మూలవాగుపై కోనరావుపేట మండలం నిమ్మపల్లి నుంచి మొదలు వేములవాడ బ్రిడ్జి వరకు 13 నిర్మించేందుకు ప్రణాళికలు రూపొందించడంతో పాటు మొత్తంగా 20 పూర్తి చేసింది. మరో నాలుగు నిర్మాణంలో ఉన్నాయి. పూర్తి చేసిన చెక్‌డ్యాంలలో నీళ్లు నిలువడంతో రెండు వైపులా భూగర్భ జలాలు పెరిగాయి. దీంతో రైతులకు పుష్కలంగా సాగునీరు అందడంతోపాటు ఇతర అవసరాలకు ఉపయోగపడ్డాయి. అయితే, గతేడాది కురిసిన భారీ వర్షాలు, భారీ వరదల కారణంగా సిరిసిల్ల మానేరు వాగుపైన సాయినగర్‌లో ఒకటి, వేములవాడ మూలవాగుపైన రెండు చెక్‌డ్యాలు కొట్టుకు పోయాయి. ఆ తర్వాత ఎన్నికలు రాగా, కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడింది. అధికారంలోకి వచ్చి ఎనిమిది నెలలవుతున్నా చెక్‌డ్యాంలను పట్టించుకోలేదు. ఫలితంగా వర్షపు నీరంతా వృథాగా పోతున్నది. ఎండకాలంలో మరమ్మతులు చేయిస్తే ఈ నీరంతా నిలిచి ప్రయోజనం దక్కేది. ఇప్పటికైనా మరమ్మతులు చేయిస్తే రైతులకు మేలు జరుగుతుంది.

## ఒకే ఒక్కడు.. 20 బైక్‌లు చోరీ

- ఒక్కో వాహనం ₹10వేలకు విక్రయం
- వచ్చిన డబ్బుతో జల్సాలు
- తాజాగా చిక్కిన అంతర్‌జిల్లా బైక్ దొంగ

మెట్‌పల్లి, ఆగస్టు 10: మద్యం, జల్సాలకు అలవాటుపడి బైక్ చోరీలకు అలవాటు పడ్డాడు. ఒకటి రెండు కాదు, ఏకంగా 20 బైక్‌లు ఎత్తుకెళ్లాడు. శనివారం తనిఖీలు చేస్తుండగా పోలీసులకు అడ్డంగా దొరికిపోయాడు. మెట్‌పల్లి పోలీస్ స్టేషన్‌లో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎస్పీ అశోక్‌కుమార్ వివరాలు వెల్లడించారు. నిజామాబాద్ జిల్లా ఏర్గట్ల మండలం గుమ్మిర్యాల గ్రామానికి చెందిన మన్నే లక్ష్మణ్ గతంలో ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేసేవాడు. ఓ ప్రమాదంలో కాలు విరగడంతో డ్రైవర్ పని మానేశాడు. ఈ క్రమంలో మద్యం, జల్సాలకు అలవాటుపడ్డాడు. సులువుగా డబ్బులు సంపాదించాలనే ఉద్దేశంతో హోటళ్లు, బస్టాండ్లు, దవాఖానలు, దుకాణాల ఎదుట హ్యాండిల్ లాక్ చేయకుండా పార్కింగ్ చేసిన బైకులే లక్ష్యంగా అపహరించుకువెళ్లడం మొదలు పెట్టాడు. ఇలా ఏడాది కాలంలో జగిత్యాల, నిజామాబాద్ జిల్లాల్లోని వివిధ ప్రాంతాల్లో 20 బైకులను ఎత్తుకెళ్లాడు. బైక్‌లను నిర్మల్ జిల్లా మామడ మండలం పొనకల్ గ్రామానికి చెందిన చికెన్ సెంటర్ నిర్వాహకుడు మహ్మద్ మోసిన్, బైక్ మెకానిక్ షాపు నిర్వాహకుడు అబ్దుల్ రషీద్‌కు ఒక్కో వాహనాన్ని ₹8 వేల నుంచి ₹10 వేల చొప్పున విక్రయించేవాడు. వచ్చిన డబ్బులతో జల్సాలు చేసేవాడు. కొద్ది రోజులుగా బైక్‌ల చోరీపై బాధితుల నుంచి వస్తున్న ఫిర్యాదుల నేపథ్యంలో ఎస్పీ ఆదేశాల మేరకు మెట్‌పల్లి డీఎస్పీ ఉమామహేశ్వర్‌రావు పర్యవేక్షణలో సీఐ నిరంజన్‌రెడ్డి, ఎస్ఐ చిరంజీవి ఆధ్వర్యంలో పోలీస్ సిబ్బంది బృందాలుగా ఏర్పడి బైక్ దొంగల కోసం గాలింపు చేపట్టారు. ఈ క్రమంలో శనివారం మధ్యాహ్నం 12 గంటల సమయంలో మెట్‌పల్లి మున్సిపల్ పరిధిలోని వెంకట్రావుపేట శివారులో జాతీయ రహదారిపై వాహనాలు తనిఖీ చేస్తుండగా బైక్‌పై అనుమానాస్పదంగా వస్తున్న వ్యక్తిని పట్టుకుని విచారించారు. బైక్‌ల చోరీకి పాల్పడినట్టు అంగీకరించడంతో పాటు ఇచ్చిన సమాచారంతో బైక్‌లు కొనుగోలు చేసిన మరో ఇద్దరిని అరెస్టు చేశారు. వారి నుంచి 20 బైక్‌లను స్వాధీనం చేసుకున్నారు. నిందితులను చాకచక్యంగా పట్టుకున్న మెట్‌పల్లి సీఐ నిరంజన్‌రెడ్డి, ఎస్ఐ చిరంజీవి, కానిస్టేబుళ్లు కిరణ్, సంతోష్‌ను ఎస్పీ అభినందించి, నగదు రివార్డులను అందజేశారు.



వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ అశోక్‌కుమార్